సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 51.666 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 51.666 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,760
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,015
3 శాతం జీఎస్టీతో	రూ.9,285
సవర (8 గ్రా)	రూ.74,280

గరిష్టం/కనిష్టం
38.4 /28.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం కూడా అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. సోమవారం గాలిలో తేమ 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మే 1న సీఎం పర్యటనకు సిద్ధంగా ఉండండి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

నెల్లూరు సిటీ : సీఎం చంద్రబాబు మే 1న ఆత్మకూరులో పర్యటిస్తారని, అధికారులందరూ సిద్ధంగా ఉండాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ సీఎం పర్యటనలో భాగంగా ఆత్మకూరు పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని, నారంపేట ఎంఎస్ఎం పార్కు ప్రారంభోత్సవం, పార్టీ కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీఓ పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పాల్గొన్నారు.

డీఐఈఓగా వీవీ సుబ్బారావు

నెల్లూరు (టౌన్): బాపట్ల జిల్లా అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా చేస్తున్న వీవీ సుబ్బారావుకు పదోన్నతి కల్పిస్తూ నెల్లూరు డీఐఈఓ (డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్)గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎఫ్ఏసీగా పని చేస్తున్న మధుబాబును ఇనమడుగు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వెనక్కి పంపించారు. సుబ్బారావు విజయవాడలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌లో ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా, ఆర్ఐఓ (రీజనరల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్)గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసులును చిత్తూరు డీఐఈఓగా పదోన్నతి కల్పించి కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు కల్పించారు. ప్రస్తుతం ఆర్ఐఓగా, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎవరిని నియమించలేదు.

28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (టౌన్): 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2025 మార్చి 31 నాటికి 5 ఏళ్లు పూర్తయి ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

జూన్ 20న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ ఖరారైంది. మే 20న నామినేషన్ స్వీకరణ కార్యక్రమం ప్రారంభమై 26న ముగుస్తుందని, 27న నామినేషన్ల పరిశీలన, 30న ఉపసంహరణ ప్రక్రియలు ఉంటాయి. జూన్ 20న ఓటింగ్ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్ రెడ్డి, సుందరయ్యాయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవు

- జేసీ కార్తీక్



నెల్లూరురూరల్: వివిధ సర్వేల్లో వ్యతిరేకత వ్యక్తమైన అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రెండో దశ రీసర్వేపై గ్రామ సభలు వెంటనే పూర్తి చేయాలన్నారు. నోషనల్ ఖాతాల విషయంలో ఈ నెల 25 నుంచి మండలాల వారీగా షెడ్యూల్ చేసి సమీక్షిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లోని ఆర్ఓ ప్లాంట్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పూర్తయిన టాయిలెట్లకు డోర్లు, కిటికీలు బిగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సిటిజన్, రైస్ కార్డ్స్ ఈకేవైసీ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ లు వేగవంతంగా చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ ఉదయభాస్కర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కడలి తీరం.. విధ్వంసం

సముద్రపు ఇసుకనూ వదలని తమ్ముళ్లు

- చెలియకట్టలు ధ్వంసం చేస్తున్న వైనం
- మత్స్యకార గ్రామాలు, పోర్టు, హార్బర్‌లకు పెనుముప్పు



సముద్ర మట్టానికి కంటే తక్కువ లోతులో ఇసుక తవ్వేసిన దృశ్యం

తమ్ముళ్ల ధనాశ.. తీరం వినాశనానికి దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సహజ వనరుల దోపిడీతోపాటు ప్రకృతిని విధ్వంసం చేస్తున్నారు. అల్పపీడనాలు, వాయుగుండాలు, సునామీ వంటి విపత్తుల్లో రాకాసి అలలను అడ్డుకునే 'ఇసుక దిబ్బ' (చెలియకట్ట)లను సముద్ర ఇసుక కోసం తవ్వేస్తుండడంతో భవిష్యత్‌లో ప్రళయాలు సంభవించే అవకాశం లేకపోలేదు. కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో కడలి తీరం విధ్వంసంతో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌తోపాటు మత్స్యకార గ్రామాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి నెల్లూరు: జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో 140 కి.మీ. వరకు తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఆ తీరం వెంబడి 98 మత్స్యకార గ్రామాలున్నాయి. సముద్రంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార గ్రామాల వినాశనానికి టీడీపీ నేతలు తెగించారు. ప్రధానంగా కావలి, కందుకూరు నియోజకవర్గాల్లోని సముద్ర తీర ప్రాంతంలో ఉండే ఇసుక కోసం మత్స్యకారుల జీవితాలనే పణంగా పెడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేల అండదండలతో వారి అనుచరవర్గం బరితెగించి ప్రకృతితోనే చెలగాటం ఆడుతోంది.

'ఇసుక మేట దిబ్బలు' తవ్వేసి..

తీరం వెంబడి సముద్రపు అలలు తాకే ప్రాంతంలో వేసే ఇసుక మేట దిబ్బ (చెలియకట్ట)ను తవ్వేసి ఇసుకాసురులు అక్రమ రవాణా సాగిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలోని టెక్కాయచెట్లపాళెం నుంచి అలగాయపాళెం తీరం వరకు, కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రం, అన్నగారిపాళెం పంచాయతీ ఒట్టూరు, లక్ష్మీపురం పరిధి తీర ప్రాంతంలో జేసీబీలను ఏర్పాటు చేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాత్రి వేళల్లో ఈ ఇసుకను తరలిస్తున్నారు. హేచరీలు, పరిశ్రమల నిర్మాణం, అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో బేసిమట్టం మధ్యలో ఎత్తులేపడానికి ఈ ఇసుకను తరలిస్తున్నారు. లవణ స్వభావం ఉండే ఈ ఇసుకను వాడడం వల్ల నిర్మాణాల మనుగడకే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



కావలి మండలం ఓట్టూరు వద్ద నది తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ఇసుక కోసం సముద్ర తీరం ధ్వంసం అవుతున్నా.. అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, మత్స్య, అటవీశాఖలకు సంబంధించిన అధికారులెవరూ ఇసుక అక్రమ రవాణా విషయాన్ని పట్టించుకోని పరిస్థితి నెలకొంది. చెలియకట్ట రెవెన్యూశాఖ పరిధిలో ఉంటుంది. ఈ భూమిలో మొక్కలు నాటి పెంచే బాధ్యత అటవీశాఖది. తీరం కాపాడడం మత్స్యశాఖ బాధ్యత. వీరందరూ తమ బాధ్యతలను మరిచిపోయారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు జరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తీరప్రాంత భద్రత కోసం ఏర్పాటు చేసిన కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ వ్యవస్థ సైతం తీరం ధ్వంసం అవుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

రామాయపట్నం, జువ్వలదిన్నె హార్బర్‌కు పెనుముప్పు

పారిశ్రామికంగా అభివృద్ధితోపాటు మత్స్యకారులు జీవితాల్లో వెలుగులు నింపే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌తోపాటు మత్స్యకార గ్రామాలకు భవిష్యత్ కాలంలో పెనుముప్పు వాటిల్లే పరిణామాలు కనిపిస్తున్నాయి. రూ.288 కోట్లతో వైఎస్సార్‌సీపీ హయాంలో జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణం పూర్తి చేశారు. ఆ నిర్మాణ కాంట్రాక్టర్‌గా స్థానిక ఎమ్మెల్యే వ్యవహరించారు. హార్బర్ నిర్మాణంలో కూడా సముద్రపు ఇసుక వాడారన్న అనుమానాలు లేకపోలేదు. ఆ పనులపై ఇప్పటికి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వణుకుతున్న తీర గ్రామాలు

తీరాన్ని ధ్వంసం చేసి భారీగా ఇసుక తరలిస్తుండంతో భారీ ముప్పు పొంచి ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికల నేపథ్యంలో తీర గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. సముద్ర మట్టం కన్నా ఎక్కువ ఎత్తుగా ఉండే ఈ భూమి నుంచి ఇసుకను సముద్ర మట్టం కన్నా తక్కువ చేయడం వల్ల సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చే అవకాశం ఉంది. తుఫాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాల సమయంలో గాలులు విసురుగా వీచినప్పుడు సముద్రంలోని అలలు గ్రామాలపైకి చేరి ముంచెత్తే అవకాశం ఉంది. 2004 డిసెంబర్ 26న వచ్చిన 'సునామీ' తీర గ్రామాలను వణికించింది. చాలా గ్రామాలను ఈ చెలియకట్టలే కాపాడాయి. గతంలో సముద్రానికి, మత్స్యకార గ్రామాల మధ్య ఇసుక తిన్నెలతోపాటు అటవీశాఖ నాటిన చెట్లు అధికంగా ఉండడం వల్ల నీరు పొంగినా గ్రామాలపైకి చేరే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఇసుక తిన్నెలు, చెట్లు కనుమరుగు కావడం వల్ల సముద్రం మట్టంతో గ్రామాలు సమానంగా చేరడం వల్ల పెనుముప్పు వాటిల్లే పరిణామాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా..

సముద్ర తీరంలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ ఆనంద్‌కు జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నపూడి తాతారావు ఇటీవల ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఇప్పటికైనా కలెక్టర్ సముద్ర ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని మత్స్యకార గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దుర్నీతి పాలనకు వడ్డీతో సహా చెల్లిస్తాం

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్నీతి పాలనకు తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహ చెల్లిస్తామని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, కూటమి నేతలు తమ పలుకుబడి ఉపయోగించి బెయిల్ రాకుండా కుట్రలు పన్నడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాలన అందించడం మానేసి అక్రమ కేసులతో వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కాకాణి రైతుల సమస్యలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను బలంగా వినిపిస్తున్నారని, ఆయన గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు పెట్టారన్నారు. కూటమి దుర్నీతిపై ఎవరు గొంతెత్తినా ఆ గొంతులు నొక్కాలని పనిగా పెట్టుకున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు అలవిగాని హామీలిచ్చి ఇప్పుడు ఏ ఒక్క హామీని నెరవేర్చలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పాలన విస్మరించి అక్రమ కేసులతో అందరిని భయ పెట్టాలంటే కుదరదని, ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మా భూములు బీపీసీఎల్‌కు ఇవ్వం

- ఆర్డీఓకు రైతులు స్పష్టం



కావలి ఆర్డీఓ కార్యాలయ ఏఓకు ప్రజాభిప్రాయ లేఖను అందజేస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులు

కావలి: 'మా భూములను ఎట్టి పరిస్థితుల్లో బీపీసీఎల్ కంపెనీకి ఇవ్వబోమని కావలి మండలం ఆనెమడుగు పంచాయతీకి చెందిన రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు తదితరులు సోమవారం కావలి ఆర్డీఓ కార్యాలయ ఏఓకు స్పష్టం చేశారు. సీపీఎం నేత తాళ్లూరు మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నేత పేముల సీతారామయ్య, ఆనెమడుగు పంచాయతీకి చెందిన మందా చిన్నయ్య, ఆర్.జయరామిరెడ్డి, కె.రవీంద్ర సోమవారం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి ఈ మేరకు లిఖిత పూర్వకంగా స్థానిక రైతుల అభిప్రాయంగా తెలియజేశారు. ఆనెమడుగులోని మా భూములను రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌తో కలిసి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) కంపెనీకి అప్పగించే ప్రయత్నం చేస్తుందని, భూములు తీసుకుంటే మా బతుకుదెరువు బుగ్గిపాలవుతుందని పేర్కొన్నారు. మేము మా భూము లను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని మీ ద్వారా కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేస్తున్నట్లు ఆ లేఖలో వివరించారు. ఒక వేళ మా పొలాలు బలవంతంగా తీసుకోవాలనుకుంటే తాము ప్రాణాలు అర్పించే దానికైనా సిద్ధమేనని, ఇప్పటికే మా నిర్ణయాన్ని కలెక్టర్‌కు, భూసేకరణ స్పెషల్ కలెక్టర్, ఆర్డీఓకు అర్జీలిచ్చి ఉన్నామన్నారు.

మెగా.. దగా

అర్హతలకు కొర్రీలు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో అర్హతలకు కొర్రీలు పెట్టడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నాళ్లగానో డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. డీఎస్సీ పరీక్షలకు పోటీపడే అభ్యర్థుల సంఖ్యను తగ్గించాలనే కుతంత్రంతో కొత్త కొత్త నిబంధనలతోపాటు ఏపీపీఎస్సీ పరీక్షలు జరిగే సమయంలో షెడ్యూల్ ప్రకటించింది. ఈ నోటిఫికేషన్ విడుదలపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఒకే సమయంలో డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలపై అభ్యర్థుల ఆందోళన
- ఇంటర్, డిగ్రీలో 50 శాతం, పీజీలో 55 శాతం మార్కుల నిబంధన
- పరీక్షలకు సమయం 45 రోజులే
- ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణపై సందేహాలు
- జిల్లాలో పోస్టులు 673.. అభ్యర్థులు 25 వేలకు పైగానే



డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

నెల్లూరు (టౌన్): డీఎస్సీ నోటిఫికేషన్ రెండుసార్లు వాయిదా వేసిన టీడీపీ ప్రభుత్వం ఎట్టకేలకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 673 పోస్టులు ఉండగా, సుమారు 25 వేల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో కేవలం 115 ఎస్జీటీ పోస్టులే ఉన్నాయి. ఈ పోస్టులకే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ పడే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 673 స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు లెక్కలు తేల్చారు. ఇందులోనే ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు హిందీ–1, ఇంగ్లిష్–1, మ్యాథ్స్–1, ఎస్జీటీలు–2 పోస్టులు ఉన్నాయి.

ఒకే సమయంలో డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలు

డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలను ఒకే సమయంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏపీపీఎస్సీ పరీక్షలు జూన్ 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏపీపీఎస్సీ పరీక్షల ద్వారా పాలిటెక్నిక్, జూనియర్ అధ్యాపకులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల భర్తీ నిర్వహించనున్నారు. తాజాగా డీఎస్సీ పరీక్షలు జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. అయితే ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులే డీఎస్సీ పరీక్షకు కూడా ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. రెండు పరీక్షలను ఏక కాలంలో నిర్వహించడం వెనుక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్యను తగ్గించే కుట్ర దాగి ఉందని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

డీఎస్సీ పరీక్షల్లో నిబంధనల కొర్రీ

డీఎస్సీ నోటిఫికేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పలు నిబంధనలు పెట్టి భావి ఉపాధ్యాయుల కలలను కల్లలు చేసింది. ఎస్జీటీ పోస్టులకు ఇంటర్‌లో 50 శాతం మార్కులు, స్కూల్ అసిస్టెంట్లు పోస్టులకు డిగ్రీలో 50 శాతం, పీజీటీ పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలన్న నిబంధన పెట్టారు. ఈ నిబంధనలతో సగమంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాసే అర్హత కోల్పోతారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఈడీలో చేరే సమయంలో డిగ్రీలో 40 శాతం మార్కులు అర్హతగా ఉంటే డీఎస్సీ పరీక్షకు 50 శాతం అర్హత మార్కులు పెట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు ఇంటర్ సిలబస్‌తో పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ప్రస్తుత ఇంటర్ సిలబస్‌పై అవగాహన లేదు. గతంలో పదో తరగతి వరకు ఉన్న సిలబస్ లోనే పరీక్ష నిర్వహించే వారు. డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో హాజరుకానున్న డీఎస్సీ పరీక్షకు అన్ని కంప్యూటర్లను ఎక్కడి నుంచి తేగలరని ప్రశ్నిస్తున్నారు. 2018లో టీడీపీ హయాంలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు తగిన కంప్యూటర్లు లేకపోవడంతో ఎక్కువ మంది అభ్యర్థులకు పొరుగు రాష్ట్రాలైన చెన్నై, ఒడిశా, తెలంగాణ, కర్ణాటకలో సెంటర్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లలేక కొందరు అభ్యర్థులు పరీక్ష రాయకుండా ఆగిపోయారు. ఆన్‌లైన్ పరీక్షల్లో తప్పులు దొర్లే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎస్ఏలు (తెలుగు)	-39
హిందీ	-18
ఇంగ్లిష్	-84
మ్యాథ్స్	-63
ఫిజికల్ సైన్స్	-76
బయాలజికల్ సైన్స్	-63
సోషల్ స్టడీస్	-103
ఎస్ఏపీఈటీ	-107
ఎస్జీటీలు	-115

పరీక్షకు సమయం తక్కువ

నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి పరీక్ష తేదీకి కేవలం 45 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇంత తక్కువ సమయంలో పరీక్ష నిర్వహిస్తే ఏ విధంగా రాయగలమని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గతంలో డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో వేల రూపాయిలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నామని, కాలయాపన చేసి ఇప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయడంతో కోచింగ్‌కు మళ్లీ ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిలబస్‌ను తగ్గించాలి



డీఎస్సీ పరీక్షకు సిలబస్‌ను తగ్గించాలి. ఎన్నడూ లేని విధంగా ఈ డీఎస్సీలో ఇంటర్ సిలబస్‌ను చేర్చడం తగదు. దీని వల్ల అభ్యర్థులు ఎక్కువ అవకాశాలు కోల్పోతారు. ఇంటర్, డిగ్రీల్లో 50 శాతం మార్కులు ఉంటేనే అర్హులని ప్రకటించడం దారుణం. ఈ నిబంధనలతో అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉంది.

– ఆదిత్యసాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

ఎక్కువ సమయం కేటాయించాలి



డీఎస్సీ నోటిఫికేషన్‌కు, పరీక్షల తేదీకి ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. కేవలం 45 రోజుల వ్యవధి మాత్రమే ఉండడం వల్ల పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అవకాశం ఉండదు. గతంలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పడంతో పై మొత్తాల్లో ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకున్నారు. ఇప్పుడు హడావుడి చేయడంతో తీవ్ర నష్టం జరుగుతోంది.

– లీలామోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ

అధికారులే సపోటా తోటను ధ్వంసం చేశారు

- రైతు చిమ్మిరి బ్రహ్మయ్య ఆవేదన



జేసీబీతో సపోటా చెట్లు తొలగిస్తున్న దృశ్యం

ఉలవపాడు: సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం అవసరమని, తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తన 35 సెంట్ల సపోటా తోటను ప్రభుత్వ అధికారులు అక్రమంగా సోమవారం జేసీబీతో ధ్వంసం చేశారని మండలంలోని మన్నేటికోటకు చెందిన రైతు చిమ్మిరి బ్రహ్మయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెండు రోజుల క్రితం పొలంలోకి విద్యుత్, పంచాయతీ అధికారులు వచ్చిన సమయంలో ఎందుకు కొలతలు వేస్తున్నారని అడిగానన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి చేస్తున్నామని చెప్పడంతో, తన పొలంలో ఎలా నిర్మిస్తారని, వెంటనే సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆమె తహసీల్దార్‌ని పిలిచి రైతుతో మాట్లాడి న్యాయం చేసి భూమి తీసుకోమని చెప్పారన్నారు. అయితే సోమవారం ఎలాంటి నోటీసు, సమాచారం లేకుండా తన పొలాన్ని ధ్వంసం చేశారన్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి ఉన్న సపోటా చెట్లు, వాటి కాపును కూడా జేసీబీతో తొలగించారని వాపోయారు.

శ్రీహర్ష & వాల్మీకి
DSC-SGT, S.A -తెలుగు, మ్యాథ్స్, సోషల్
నేడే క్రొత్త బ్యాచ్ ప్రారంభం
స్టేట్ నెం.1 ఫ్యాకల్టీచే బోధన, డైలీ వీక్లీ గ్రాండ్ టెస్టులు
Beside Red Cross Blood Bank, Madras Bus Stand, Nellore.
Cell : 92470 01115, 62812 29244

అర్జీలిచ్చి.. స్పందించాలని కోరి..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- సూపర్‌సిక్స్ అమలు చేయాలంటూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ధర్నా
- భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దు
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ ఆనంద్


సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు

నెల్లూరు రూరల్: జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలపై అధికారులకు అర్జీలిచ్చారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రధానంగా రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

- నెల్లూరు నగరంలో ఏదైనా కూడలిలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 400కు పైగా అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఇందులో అధికంగా రెవెన్యూ సమస్యలపై వచ్చాయన్నారు.

సూపర్‌సిక్స్ ఎప్పుడిస్తారు?

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు ఎప్పుడిస్తారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు ప్రశ్నించారు. వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. తల్లికి వందనం అమలు చేయకపోవడంతో నిరుపేదలు అప్పుల పాలయ్యారన్నారు. నిరుద్యోగ భృతి పథకానికి సంబంధించి ఇంతవరకూ సన్నాహాలు ప్రారంభించలేదన్నారు. రైతుకు రూ.20 వేల సాయం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.శ్రీనివాసులు, కె.రాంబాబు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సునీల్, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు కె.వసంతమ్మ, టీవీ సరోజ పాల్గొన్నారు.

ఉక్కపోతతో అల్లాడిన జనం

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండ వేడిమికి జనం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో అర్జీల రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఫ్యాన్లు పని చేయలేదు. దీంతో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అర్జీదారులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. భోజనాల దగ్గర పెట్టిన తాగునీరు అయిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పనిచేయని ఫ్యాన్లు

బీడుగా పంట భూములు


మాట్లాడుతున్న కోటితీర్థం వాసులు

చేపల చెరువులకు ఉపయోగించే కోళ్ల వ్యర్థాలతో పంట భూములు బీడుగా మారుతున్నాయని చేజర్ల మండలం కోటితీర్థం గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ వ్యర్థాలున్న నీటిని పంట కాలువలకు వదలడంతో పైర్లు పండటం లేదన్నారు. మూగజీవాలు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. విజయ, అరుణ, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలంటూ..

బీసీ సబ్సిడీ లోన్స్ విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని బీసీ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్ జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. లోన్స్ ఇప్పిస్తామని కొందరు నిరుద్యోగ యువత నుంచి డబ్బు వసూలు చేశారన్నారు. నిజమైన లబ్ధిదారులు లోన్లు పొందలేని పరిస్థితి ఏర్పడిందని, దీనిపై విచారణ చేయాలని కోరారు.


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సుభాష్

మత్స్య సంపదను వేలం వేయొద్దు


కలెక్టర్‌తో మాట్లాడుతున్న సంఘ నాయకులు

కనిగిరి రిజర్వాయర్లో మత్స్య సంపదను వేలం వేయొద్దంటూ కలెక్టర్‌కు యానాదుల సంక్షేమ సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. వేలం వేస్తే యానాదుల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. మత్స్య శాఖకు లీజు చెల్లించేందుకు కొంత సమయం ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య, చెంబేటి ఉష, పాట్టేళ్ల నాగరాజు, శివనాగమణి, పాట్లూరు నాగరాజు, ఏకొల్లు శీనయ్య, బాలు, వెంకటేష్, సొసైటీ డైరెక్టర్లు బంగారయ్య, యల్లంపల్లి శీనయ్య, నరసయ్య, కత్తి బాలయ్య పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు ఉంచాలి


మాట్లాడుతున్న పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ఉంచాలని, అలాగే విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ నేతలు కోరారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు చెల్లించిన వారికి సరైన రసీదులు ఇవ్వడం లేదని తెలిపారు. పాఠశాలలో సరైన రసీదులు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు నరహరి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం


సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- ఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన బాధితులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 119 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బు తీసుకున్నారు. తక్కువ ధరకే బంగారం పేరిట మోసగించారు, కుమార్తె మృతికి అల్లుడు, అత్తింటివారు కారణం, కొడుకు, కోడలు ఆస్తి రాయించుకుని ఇంట్లో నుంచి తరిమేశారు, కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబాన్ని చక్కదిద్దాలి.. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో గాథ. విచారించి న్యాయం చేయాలని బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా 119 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఆయా ప్రాంత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇపిస్తానని రూ.4.85 లక్షలు తీసుకుని మోసగించిన తెలంగాణ రాష్ట్రం గోదావరిఖనికి చెందిన శ్వేతపై చర్యలు తీసుకోవాలని రాపూరుకు చెందిన ఓ యువకుడు కోరాడు.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నెల్లూరు రూరల్ మండలానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి రూ.84 వేలు తీసుకుని మోసగించాడు. న్యాయం చేయాలని అదే మండలానికి చెందిన ఓ యువకుడు విజ్ఞప్తి చేశాడు.
- కావలికి చెందిన కిశోర్ తన అనుచరులతో కలిసి తక్కువ ధరకే బంగారం ఇస్తానని రూ.40.90 లక్షలు తీసుకుని మోసగించాడు. నగదు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడని తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న నా కుమార్తె ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై లోతైన విచారణ జరిపి అందుకు బాధ్యులైన భర్త, అత్త తదితరులపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు.
- పాతకక్షలు మనసులో పెట్టుకుని తనపై దాడి చేసిన శీనయ్య మరికొందరిపై చర్యలు తీసుకోవాలని అల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కోరాడు.
- కొడుకు, కోడలు నా పేరుపై ఉన్న ఆస్తిని వారి పేరు మీద మార్చుకుని ఇంటి నుంచి తరిమేశారని కలిగిరికి చెందిన ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది.
- రెండో కుమారుడు బాగా చూసుకుంటానని నమ్మించి నా పేరుపైనున్న ఆస్తిని రాయించుకుని అమ్మేశాడు. అనంతరం నన్ను పట్టించుకోవడం మానివేశాడు. నేను డయాలసిస్ పేషెంట్‌ను. చికిత్స చేయించుకునేందుకు డబ్బుల్లేవు. తగిన చర్యలు తీసుకోవాలని కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ వృద్ధురాలు అభ్యర్థించారు.
- నా భర్త వ్యసనాలకు బానిసై నన్ను, నా పిల్లలను పట్టించుకోవడం లేదు. కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాన్ని చక్కదిద్దాలని వేదాయపాళేనికి చెందిన ఓ వివాహిత విజ్ఞప్తి చేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.90
సన్నవి	రూ.65
పండ్లు	రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	100	బ్రాయిలర్	
లేయర్ (లైవ్)	100	స్కిన్‌లెస్	204
బ్రాయిలర్ చికెన్	184	లేయర్ చికెన్	170

క్లుప్తంగా

మహిళ అనుమానాస్పద మృతి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి సమీపంలో వాగు కాలువలో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. వాగు కాలువలోని బురదనీటిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళకు 50 సంవత్సరాల వయసు ఉండొచ్చని, చనిపోయి మూడురోజులై ఉంటుందని భావిస్తున్నారు. అనారోగ్యంతో మృతిచెందిందా లేక, ఆత్మహత్య అని స్పష్టత లేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఇంట్లో అగ్నిప్రమాదం


కాలిపోయిన వస్తువులు

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్, మరే ఇతర కారణమో తెలియదు గానీ నెల్లూరు నగరంలోని కంసాలవీధిలో ఉన్న కృష్ణ చైతన్య అనే వ్యక్తి ఇంట్లో కింద పోర్షన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. దట్టమైన పొగ రావడాన్ని గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు. ఏడీఎఫ్ఓ ఎస్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అతి కష్టంపై అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే వస్తువులు కాలిపోయాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదానికి కారణాలు తెలియరావాల్సి ఉంది.

మా భూములిచ్చే ప్రసక్తే లేదు

- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కరేడు గ్రామస్తుల ధర్నా


ధర్నా చేస్తున్న కరేడు ప్రాంతవాసులు తదితరులు

కందుకూరు: 'ప్రభుత్వం మా జీవనాధారమైన భూములను లాక్కునే ప్రయత్నం చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చే ప్రసక్తే లేదు' అని కరేడు గ్రామస్తులు అన్నారు. బీపీసీఎల్, సోలార్ ప్లాంట్ల కోసం ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ సారవంతమైన భూములను తీసుకుంటే ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. వెంటనే భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌ఏ గౌస్ మాట్లాడుతూ గతంలో అనేక ప్రాంతాల్లో భూసేకరణ చేశారని, ఇప్పటివరకు నిర్వాసితులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని వివరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంకాల రామసుబ్బారెడ్డి, దారం శ్రీనివాసులు, కె.రమణయ్య, లింగారెడ్డి రామకోటిరెడ్డి, గంజి రామకోటయ్య, సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, ఎస్‌కే మున్వర్ సుల్తానా, నాదెండ్ల కోటేశ్వరరావు, ఎస్‌కే మల్లిక, ఎం.పద్మ, ఎస్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక..

- సెంట్రింగ్ మేస్త్రి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధ తాళలేక సెంట్రింగ్ మేస్త్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో అర్ముగం మురుగేశన్ వెంకటేష్ (42), స్వాతి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. వెంకటేష్ సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. కొంతకాలం క్రితం అప్పులు చేసి సెంట్రింగ్ సామగ్రి కొనుగోలు చేశాడు. పనులు సరిగా లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో ఆదివారం అర్ధరాత్రి పడకగదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి మృతదేహాన్ని కిందకు దించారు. వేదాయపాళెం ఎస్సై ముత్యాలయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన మెడికల్ సర్టిఫికెట్లను పొందాలి

నెల్లూరు(టౌన్): జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బదిలీల కోసం నూతన మెడికల్ సర్టిఫికెట్లను పొందాలని డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాత మెడికల్ సర్టిఫికెట్లు చూపించి సంబంధిత వైద్యులతో పరీక్షలు చేయించుకుని కొత్తవి పొందాలన్నారు.

కండలేరులో 45.801 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 45.801 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 220, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

ముగిసిన చెస్ ర్యాంకింగ్ పోటీలు


ర్యాంకింగ్ సాధించిన విజేతలతో అతిథులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ముత్తుకూరు రోడ్డులోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్లో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి ఫన్ పార్క్ ఎండీ సాయి పొత్తూరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతపురానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ మొదటి ర్యాంక్, హైదరాబాద్‌కు చెందిన అక్షయ్ కుమార్ రెండో ర్యాంక్, నెల్లూరుకు చెందిన హరిరామ్ సాయికృష్ణ మూడో ర్యాంక్, రామ్‌లిఖిత్ నాలుగో ర్యాంక్, గిరిబాబు ఐదో ర్యాంక్ సాధించారు. వ్యాపారవేత్త పచ్చిపులుసు శ్రీరాములు, ఘుమఘుమలు రెస్టారెంట్ అధినేత ఎస్.కల్యాణ్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్, స్కూల్ డైరెక్టర్లు షణ్ముకచారి, వెంకటాద్రి నాయుడు, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీనాథ్, కోచ్ డాక్టర్ మధుసూదన్, జేసీస్ జోనల్ వైస్ చైర్మన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SHAIK MAHABOOB BEE (Old name), Resident of Kanupuru palli Village & Post, Kaluvoy Mandal, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as SHAIK MAHABUNNISA (New name) W/o SHAIK JAMAL SAHEB.

CHANGE OF NAME
I, SHEK RASUL (Old Name), Resident of Harijanawada, Sri Ram Nagar Colony, Talamanchi Village, Padmanabhasathram Post, Kodavalur Mandal, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as SHAIK RASUL (New name) S/o. SHEK KHADAR (Late).

CHANGE OF NAME
I, SHEK SHERMILA (Old Name), Resident of Harijanawada, Sri Ram Nagar Colony, Talamanchi Village, Padmanabhasathram Post, Kodavalur Mandal, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as SHAIK SHARMILA (New name) W/o. SHAIK RASUL.

LOST
I, KAITHEPALLI JANAKIRAM S/o. KAITHEPALLI SREENIVASULU, Residing of Flat No.104, Rama krishna Puram, Central Residency Apartment, Naidupeta Town & Mandal, Tirupati Dt, AP. I have lost my Passport bearing No. K1399572 at Xerox Center, Chillakuru, Tirupati District on 10/04/25. If anyone found please inform at the above address.

CHANGE OF NAME
I, RAVULA DASARADHAMAIAH GOWD (Old name), Resident of Plot No. 10, Near Nellore Club, Prasanthi Nagar, Dargamitta, Nellore -524003, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as RAVULA DASARADHARAMAIAH GOWD (New name) S/o.RAVULA ANKAIAH GOWD.

CHANGE OF NAME
I, RAVULA SRIDEVI (Old Name), Resident of Plot No. 10, Near Nellore Club, Prasanthi Nagar, Dargamitta, Nellore -524003, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as RAVULA SREEDEVI (New Name) W/o.RAVULA DASARADHA RAMAIAH GOWD.

CHANGE OF NAME
I, PERAMBATTU BHASKARA RAO (Old name), Resident of 28/1A-6-85/27, Shirdi Avenue, 4th Mile, Navalakula Gardens, Back side Brindavan Appts. Nellore Rural, SPSR Nellore Dt-524002, AP. Here by declare that I have changed my name as PARAMBATTU BHASKAR (New name) S/o. PERAMBATTU RAMALINGAIAH.

EDUCATION
■ Online Education :UG & PG Courses (Online Classes & Exam) Eligible for All Government Jobs & Promotions (Andhra & Vignan University). Maruthi Online Education. NLR : 90320 30145 / 147. [NA-6891]

■ Wanted Experienced Teachers to Teach 6th to 9th Classes. Sub:English, Maths, Science & Social. Office Staff, with Computer Knowledge & Also Van Drivers. To Work in Reputed School in Nellore. Cont: 89855 83305. [NA-2825]

REAL ESTATE
FLAT FOR SALE
■ నెల్లూరు మినీ బైపాస్ రోడ్డు దగ్గర మాగుంట లేఅవుట్‌లో పావని ట్రిడెంట్ అపార్ట్‌మెంట్‌లో 3BHK Flat (1660Sqft వుడ్ వర్క్ & 2కార్ పార్కింగ్‌తో) అమ్మబడును. 73869 13216. [NA-24152]

■ 100% వాస్తుతో Flats for Sale, 1550 Sft. గల 3 BHK Flats అమ్మబడును. అల్లిపురం రోడ్, వేమారెడ్డి నగర్, నెల్లూరు. సంప్ర : 92464 33376, 89198 76086 [V- 2784]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [M-1268568]

■ RK Grand Guest Inn లో రిసెప్షనిస్ట్, రూం బాయ్స్ కావలెను. 30సం॥లోపు, సింహపురి హాస్పిటల్ వద్ద, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 81432 19219. [N-1268086]

■ BEST MONEY GOLD కంపెనీ కావలిలో పని చేయుటకు ఇంటర్ / డిగ్రీ కలిగిన అభ్యర్థులు కావలెను. వివరములకు సంప్రదించండి: 91500 11538, 91500 61325. [N-1273066]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA25002806]

■ కష్టలేస్తి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ 15వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 9014885406 [HA-379]

■ ఫైనాన్స్ కంపెనీలో నెల్లూరు, నాయుడుపేట, వెంకటగిరి, కావలి, అల్లూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు పేటలలో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ & నెల్లూరు టౌన్‌లో అనుభవం కలిగిన లేడీ టెలికాలర్స్, టీమ్ లీడర్స్ కావలెను. 9392915938, 9392915944 [HA-53]

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393937 [HA-453]

TRAINING
■ ప్రభుత్వ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా కంప్యూటర్, Tally, టైలరింగ్ కోర్సుల నందు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును. ఉచిత హాస్టల్ వసతి కలదు. సంప్ర: 81061 46126. [NA-016]

WANTED
■ Telecallers-10, H.R-4 & Team Admin-4 with 5 Yrs Exp. కావలెను. Qlf: 10 to PG Office Timing : 9am to 5pm. Contact: 70950 34779 Sendme C.V. [N-1260171]

■ Wanted Female Teachers for Kinder garten & Primary (Eng, Maths & Science) Spoken English is a must. Location : Balaji Nagar, NLR.Contact: 9515333482. [NA-6896]

■ ఆఫీస్ స్టాఫ్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ (Female) కావలెను. తెలుగు టైపింగ్ చేయువారికిప్రాధాన్యత.వివరములకుసంప్రదించండి: 9492218808, 94924 65627. [NA-5511]

■ ప్రముఖ ECOM కంపెనీలో పని చేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. Flipkart, Meesho వంటి వాటిలో పనిచేసే వారికి ప్రాధాన్యత. సంప్రదించండి:78420 15550. [NA-6895]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నెల్లూరులో పని చేయుటకు 12గం॥లు, జీతం : 14000/-, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి : 91103 39912, 73308 34778. [NA-6894]

■ ప్రముఖ వాటర్ ప్లాంట్ నందు పని చేయుటకు క్యాన్లు డెలివరీకి ఆటో డ్రైవింగ్ తెలిసిన డెలివరీ బాయ్స్, హెల్పర్స్ కావలెను. జీతం: 15000-18000. ఉచిత వసతి కలదు. 9182009306. [NA-24099]

■ ఫోర్స్ కంపెనీ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. బుజబుజనెల్లూరు, నెల్లూరు. సెల్: 95812 99916, 94929 34103. [NA-6889]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

SR VIDYANIKETHAN
(Recognised by the Govt. of AP)
Pullareddy Nagar - Kavali, SPSR Nellore Dt.
Ph : 73829 44446, 76720 11049.
WANTED FACULTY
We are Looking for Academic Wing : Teachers for pre - primary, Primary & High School for all subjects IIT, JEE & NEET Foundation experts.
- must be professionally well - qualified
- must possess in - depth knowledge in the relevant subject
- fluency in English is MANDATORY.
- Qualification : B.Ed., COMPULSORY
LAST DATE OF APPLICATIONS : 27-04-2025
CORRESPONDENT

దళితులపై కేసులు ఎత్తేయాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు, దళితులు

నెల్లూరు(అర్బన్): సైదాపురం మండలం ఊటుకూరు గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన భూస్వాములపై చర్యలు చేపట్టి, దళితులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని అఖిల భారత రైతు – కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన పలువురు దళితులు సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 356, 359లో 400 ఎకరాల ప్రభుత్వ భూములను పెత్తందారులు ఆక్రమించారన్నారు. ఇందుకు తహసీల్దార్, మైనింగ్ అధికారులు సహకరించారన్నారు. సెంటు భూమిలేని నిరుపేద దళితులు కూడా ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే వారిపై మైనింగ్, రెవెన్యూ అధికారులు కలిసి కేసులు పెట్టారని తెలిపారు. కేసులను తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ 359 సర్వే నంబర్‌లో 60 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజు కోసం దరఖాస్తు చేసిందన్నారు. ఆ కంపెనీకి ఈసీ కూడా ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. ఆ సర్వే నంబర్‌లో భూమిని సాగు చేస్తున్న దళితులపై కేసులు పెట్టడం దారుణమన్నారు. గతంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వగా న్యాయం చేసేందుకు పూనుకున్నారన్నారు. అయితే రాజకీయ నేపథ్యంలో తహసీల్దార్ అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. జిల్లా సర్వేయర్ ద్వారా సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి బంజరు, మిగులు, పోరంబోకు భూములను దళితులకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రమేష్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు మమత, నాగమణి, వెంకటరమణమ్మ, సంఘం నాయకులు కోటయ్య, శ్రీను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.